ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



2



2

ఆలయం.. అభివృద్ధికి దూరం

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in




అంకాపూర్ ఉన్నత పాఠశాల 2007-08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. – అక్షరటుడే, ఆర్మూర్



## శ్రీరామ్‌సాగర్‌కు కొనసాగుతున్న వరద



**అక్షరటుడే, మెండోరా :** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు 37 వరద గేట్లు ఓపెన్ చేసి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 1.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 1090.90 (80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. రాష్ట్రంలో, మహారాష్ట్రలో వర్షాలు పడుతుండటంతో ప్రాజెక్ట్‌కు వరద పెరిగే అవకాశం ఉంది. దీంతో అధికారులు గోదావరిలోకి నీటి విడుదలను పెంచారు. శనివారం తొమ్మిది గేట్ల ద్వారా దిగువకు నీటిని వదిలిన అధికారులు ఆదివారం 37 గేట్లను ఎత్తారు.

### నిజాంసాగర్‌లోకి..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 21,377 క్యూసెక్కుల వరద వస్తోంది. వరద గేట్ల ద్వారా 19,083 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 17.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## ప్రజలను చైతన్యపర్చడంలో కళా బృందాలదే చురుకైన పాత్ర



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మాదకద్రవ్యాల వైపు యువత మొగ్గుచూపకుండా ప్రజలను పోలీసు కళా బృందాలు చైతన్య పరుస్తున్నాయని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పరిధిలలో గ్రామాలకు కళాబృందం సభ్యులు వెళ్లి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

### సైబర్ నేరాలు.. డ్రగ్స్ నిరోధంపై అవగాహన..

పోలీస్ సిబ్బంది కళాబృందాలుగా ఏర్పడి ప్రతిపల్లెలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం, మహిళల రక్షణ, మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. కొంతమంది స్వార్థపరులు అమాయకుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారని.. ప్రజల్లో అవగాహన కలిగినప్పుడే సైబర్ నేరాలు తగ్గుతాయన్నారు.



# జెడ్పీ పీఠంపై ఫోకస్..

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో సందడి మొదలైంది. పలువురు ఆశావహులు పోటీకి ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా జెడ్పీ పీఠం కోసం అధికార పార్టీలో పోటీ తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు నాయకులు జెడ్పీ ఛైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కొందరు అభ్యర్థులు జెడ్పీ పీఠం దక్కించుకోవాలని చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

- జనరల్ కేటగిరికి రిజర్వ్ అయిన పదవి
- పోటీకి పలువురు ప్రముఖుల ఆసక్తి
- తన సతీమణిని బరిలోకి దించాలని చూస్తున్న రవీందర్‌రెడ్డి!

కామారెడ్డి జెడ్పీ ఛైర్మన్ పదవి ఈ సారి జనరల్ కేటగిరికి రిజర్వ్ అయింది. ప్రధాన పార్టీలన్నీ మెజారిటీ జెడ్పీటీసీ స్థానాలు గెలుచుకుని జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. దీంతో చాలా మంది ఆ పదవి దక్కించుకోవాలని చూస్తున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో పోటీ తీవ్రంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా తనకంటూ ఒక బలమైన వర్గాన్ని ఏర్పరచుకున్న ఏనుగు రవీందర్ రెడ్డి కూడా జెడ్పీ పీఠంపై కన్నేసినట్టుగా తెలుస్తోంది. తాడ్వాయి జెడ్పీటీసీగా ఆయన సతీమణి ఏనుగు మంజులను బరిలోకి దించాలని ఆయన చూస్తున్నట్లు సమాచారం. జెడ్పీటీసీగా తన భార్యను గెలిపించుకొని జెడ్పీ పీఠం దక్కించుకోవాలని ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

### వడ్డేపల్లి సైతం..

కాగా కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సైతం జెడ్పీ పీఠం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఎమ్మెల్యే మదన్ మోహన్, వడ్డేపల్లి మధ్య వర్గపోరు ముదరడంతో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. సీఎంతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలో సస్పెన్షన్ ఎత్తి వేయించుకొని పార్టీ నుంచి జెడ్పీటీసీగా పోటీ చేయాలని ఆయన చూస్తున్నట్లు సమాచారం.

### షబ్బీర్ అలీ ఆశీస్సుల కోసం ప్రయత్నాలు

జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న షబ్బీర్ అలీ ఈసారి తన అనుచరగణానికి జెడ్పీ పీఠం ఇప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. కామారెడ్డి నియోజకవర్గానికే ఛైర్మన్ అవకాశం ఇవ్వాలని ఆయన కోరనున్నట్టుగా తెలుస్తోంది. ఉమ్మడి మాచారెడ్డి మండలానికి చెందిన ఓ నాయకునికి ఇప్పటికే ఛైర్మన్ పీఠంపై హామీ ఇచ్చారని ప్రచారం సాగుతున్నా ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది. నియజకవర్గం నుంచి ఛైర్మన్ పదవి కోసం పోటీ పడే అభ్యర్థులు షబ్బీర్ అలీ ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఆర్యవైశ్య సంఘానికి పూర్వవైభవం రావాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఆర్యవైశ్య సంఘానికి పునర్వైభవం వచ్చేలా ప్రతిఒక్కరూ సహకరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో కిషన్ గంజ్‌లోని కార్యాలయంలో ఆత్మీయ స్నేహ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి అనుబంధ సంఘాలన్నీ సహకరించాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలన్నీ మరిచిపోయి ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఇందూరు ఆర్యవైశ్యులకు ప్రత్యేక స్థానం ఉండేదన్నారు. మళ్లీ ఆ దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని ఆ తర్వాత అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్, గాలి నాగరాజు, వీరమల్లు రమేష్ పాల్గొన్నారు.





## ఘనంగా ఊర పండుగ



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని చంద్రాయన్ పల్లి, గన్నారం గ్రామాలలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పాడిపంటలు బాగుండాలని, ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఏడాది ఊర పండగ నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. పండగ సందర్భంగా శివసత్తులు గ్రామ చావడి వద్ద చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం బంధుమిత్రులతో వన భోజనాలకు వెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి యెండల లక్ష్మీనారాయణ సూచించారు. నస్రుల్లాబాద్ మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు చందూరి హన్మాండ్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కేంద్రం అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లు, జన్‌ధన్ ఖాతాలు, ఉచిత బియ్యం వంటి పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పంచాయతీల్లో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం కేంద్ర నిధుల ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, నస్రుల్లాబాద్ మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి మోహన్ రెడ్డి, సున్నం సాయిలు, వడ్ల సతీష్, లక్ష్మణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో భారీ వర్షం



**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూరు, తాడ్వాయి మండలాల్లోని పలు గ్రామాల్లో భారీగా వర్షం పడింది. కామారెడ్డి పట్టణంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. డ్రెయినేజీల నుంచి వచ్చిన నీరంతా ప్రధాన రహదారులపై చేరింది. రైల్వే కమాన్, స్టేషన్ రోడ్, సిరిసిల్ల రోడ్డు, నిజాంసాగర్ చౌరస్తా, అశోక్ నగర్ కాలనీ కలెక్టరేట్ వెళ్లే రహదారులు నీటితో నిండిపోయాయి.

### రైతుల ఆందోళన

జిల్లాలో చేతికొచ్చిన వరి పంటను కోయడానికి రైతులు సిద్ధమయ్యారు. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలో వర్షం పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటను కోయడానికి రైతులు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. పంట కోస్తే ధాన్యం తడిసిపోయే అవకాశాలు ఉన్నాయి. కోయకుండా వదిలేస్తే వర్షానికి పంట నేలవాలడంతో పాటు గింజలు రాలిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## వరద బాధితులకు పరిహారం ఇవ్వాల్సిందే..

**మాజీ మంత్రి హరీష్ రావు**

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వరద బాధితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంతాలను ఆదివారం ఆయన సందర్శించారు. బాధిత రైతులతో మాట్లాడారు. పంటనష్టం వివరాలను రైతుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారీ వరదల కారణంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. కామారెడ్డి పట్టణంలోనూ పరిస్థితి దారుణంగా మారిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం వచ్చి వరద ప్రాంతాలను సందర్శించినా ఏమీ ఉపయోగం లేదన్నారు.

### నెలరోజులైనా రైతు గోస పట్టదా..?

సీఎం క్షేత్రస్థాయిలో పర్యటించి నెలరోజులు దాటినప్పటికీ రైతులకు నష్టపరిహారం అందకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా సీఎం నష్టపరిహారం అందిస్తామని ప్రకటించినా ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. పంటనష్టంపై ఇప్పటికే రూ. 344 కోట్లు నష్టం జరిగిందని అధికారులు నివేదికలు పంపినా.. సీఎం రేవంత్‌రెడ్డి రూ. 34 కూడా ఇవ్వలేదని హరీష్ రావు విమర్శించారు. కామారెడ్డి నియోజకవర్గం ఇప్పటికీ వరద నష్టం నుంచి కోలుకోలేదని ఆయన పేర్కొన్నారు.



వరద బాధితులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న హరీష్‌రావు

### ఇన్‌ఛార్జి మంత్రి ఉన్నట్టా.. లేనట్టా..

భారీ వర్షాలతో రోడ్లు ధ్వంసమై ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి రవాణా స్తంభించిందని హరీష్ రావు అన్నారు. పోచారం కాలువను మరమ్మతులు చేయించాలని.. గండ్లను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒక మంత్రి పదవి ఇవ్వలేదు.. ఉన్న ఇన్‌ఛార్జి మంత్రి ఒక్కరూపాయి ఇవ్వలేదని విమర్శించారు. అసెంబ్లీలో సమస్యను లేవనెత్తుతాం.. బాధిత రైతులకు నష్టపరిహారం అంశాన్ని అసెంబ్లీలో చర్చకు తీసుకొస్తామని హరీష్ రావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సీఎంకు చిత్తశుద్ధి ఉండి ఉంటే ఈపాటికి రైతుల గోస విని నష్టపరిహారం ప్రకటించేవాడని పేర్కొన్నారు. హరీష్ రావు వెంట ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## సెలవులు ముగియడంతో తిరుగు పయనం..



**అక్షరటుడే, ఆర్మూర్:** దసరా సందర్భంగా పట్టణవాసులు తమ సొంతూళ్లలో పండుగను ఆనందంగా జరుపుకున్నారు. బంధువులను కలుసుకుని సంబురంగా గడిపారు. ఇక ఆదివారంతో సెలవులు ముగిశాయి. దీంతో ఉదయం నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రజలు వెళ్తున్నారు.

### టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ జాం..

పల్లెలు, పట్టణాల నుంచి హైదరాబాద్‌కు ప్రజలు తిరుగుముఖం పట్టడంతో ఇందల్వాయి, భిక్కనూరు టోల్‌ప్లాజాల వద్ద విపరీతమైన వాహనాల రద్దీ నెలకొంది. టోల్‌ప్లాజా వద్ద కార్లు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాల నుంచి అధికంగా ప్రజలు హైదరాబాద్‌కు తరలివెళ్తున్నారు. దీంతో 44వ జాతీయ రహదారి సందడిగా మారింది.

## ఫైర్ స్టేషన్‌లో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఫైర్‌స్టేషన్‌లో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 23వ స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా ఫైర్‌స్టేషన్‌లో పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న ఇటువంటి కార్యక్రమాలను యువత స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బందితో పాటు సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బోడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్, గణేష్, శ్యాంసుందర్, ముధుసూదన్, నరేందర్, ఎల్లయ్య, కృషివర్ధన్, నూకల ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**అక్షరటుడే, మెండోరా:** మండల కేంద్రానికి చెందిన తూర్పు భూమన్న, వెల్గటూర్ గ్రామానికి చెందిన ముత్తన్న అనారోగ్యంతో ఇటీవల మరణించారు. దీంతో ఆదివారం బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి పరామర్శించారు. సావెల్ గ్రామానికి చెందిన ఆకుల నరేష్ ఇటీవల దుబాయిలో గుండెపోటుతో మరణించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున వచ్చే రూ.5 లక్షల కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**అక్షరటుడే, బోధన్:** మండలంలోని పలు సొసైటీల్లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. సొసైటీల స్పెషల్ ఆఫీసర్ అరుణ్ కుమార్ మినార్ పల్లి, అమ్దాపూర్‌లలో కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సొసైటీల కార్యదర్శులు హన్మాండ్లు, రాజేశ్వర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ మరమ్మతులకు విరాళం



**అక్షరటుడే, ముప్కాల్ :** మండల కేంద్రంలోని భూదేవ్ ఇండోర్ స్టేడియంలో గల వాటర్ ట్యాంక్ మరమ్మతుల కోసం గంగారం-నర్సుబాయి జ్ఞాపకార్థం వారి కుమారుడు స్వామి రూ.15 వేలు విరాళం అందించారు. ట్యాంకు నిరుపయోగంగా ఉండటంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో మరమ్మతులు చేపట్టనున్నారు. కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కబడ్డీ గంగాధర్ రెడ్డి, కార్యదర్శి దినేష్, జాతీయ కబడ్డీ క్రీడాకారులు ఏలేటి రాములు, గంగారాజు, కోచ్ సాయిలు, సీనియర్ క్రీడాకారులు ముస్కు మోహన్, టి. సాయన్న, బద్దం నర్సయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత బలవన్మరణం

**అక్షరటుడే, లింగంపేట:** అనారోగ్యంతో బాధపడుతూ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన లింగంపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన కొట్టంల భాగ్యలక్ష్మి(20) అనారోగ్యంతో బాధపడుతోంది. నాలుగునెలల నుంచి మానసికంగా కృంగిపోయిన ఆమె ఆదివారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణం చెందింది. ఆమెకు భర్త శేఖర్, ఏడాదిన్నర పాప ఉన్నారు. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**ఎంతో ఘన చరిత్ర కలిగిన ఇందల్వాయి రామాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. పలుమార్లు ప్రజాప్రతినిధులు ఆలయాన్ని సందర్శించి, అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీలు ఇస్తున్నారు. కానీ, ఇప్పటివరకు ఏ ఒక్కరూ నిధుల మంజూరుకు కృషి చేసింది లేదు. పాలకుల నిర్లక్ష్యంతో చారిత్రాత్మకంగా ఎంతో ప్రాముఖ్యమున్న ఈ అపురూప రామాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు.**

**- అక్షరటుడే, ఇందల్వాయి**



# అపురూప ఆలయం.. అభివృద్ధికి దూరం..

- ఇందల్వాయి రామాలయంలో ఆరడుగుల రాములోరి విగ్రహం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి తన హయాంలో ఈ ఆలయాన్ని నిర్మించడమే కాకుండా ఆలయంలో ఆరడుగుల అందమైన రాములోరి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. గర్భాలయంలో రాములోరి తొడపై సీతమ్మవారు కొలువై భక్తులను ఆకర్షిస్తుంది. అంతేగాక, లక్ష్మణుడు లేకుండా వెలిసిన రామాలయం కూడా ఇదే కావడం విశేషం. దక్షిణ భారతదేశంలో తిరుపతి తర్వాత అంతటి ప్రాచుర్యం పొందిన ఆలయంగా 1838 సంవత్సరంలో ప్రచురించిన కాశీయాత్ర చరిత్ర పుస్తకంలో రచయిత ఏనుగుల వీరస్వామి ఇందల్వాయి రామాలయం గురించి ప్రస్తావించారు. ప్రతి రామాలయంలో సీతారాములతో పాటు లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు ఉంటాయి. ఇక్కడ మాత్రం లక్ష్మణుడు లేకుండా సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహం మాత్రమే ఉంటుందని, లక్ష్మణుడు లేని రామాలయం చాలా అరుదని ఆలయ పూజారి గోపాలచారి పేర్కొన్నారు.

### నిజామాబాద్ నుంచి విగ్రహం..

ఈ ఆలయంలో లక్ష్మణుడు లేకుండా హనుమంతుని విగ్రహం ఉండడం విశేషం. ఆరడుగుల ఈ విగ్రహం నిజామాబాద్ రఘునాథ్ ఆలయం నుంచి తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చరిత్ర. మొగల్ రాజు ఔరంగాజేబు హిందూ ఆలయాలు ధ్వంసం చేస్తున్న సమయంలో ఆరడుగుల విగ్రహం ధ్వంసం కాకూడదని ఇందల్వాయి గ్రామానికి తరలించి, సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. విగ్రహం చుట్టూ దశావతారాలు, లోపల మూడు సాల గ్రామాలు ఉన్నాయి. అన్ని రామాలయాల్లో కర్కాటక లగ్నంలో స్వామివారి కల్యాణం జరిపిస్తే, ఇక్కడ మాత్రం జన్మదిన వేడుకల రోజు నిర్వహిస్తారు. శ్రీరామనవమి సమయంలో తొమ్మిది రోజులపాటు ఇక్కడ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పొన్నచెట్టు వాహన సేవ, నాగవల్లి కార్యక్రమాలు భక్తులను ప్రత్యేకంగా ఆకర్షిస్తుంటాయి. శీలం జానకీబాయి పాలన కాలంలో ఆలయం చుట్టూ సైనికుల పహారా, ఆలయ ఆవరణలో ఆయుధాగారం ఉండేది. ఇక్కడ తయారుచేసే ఆయుధాలు పలు సంస్థానాలకు ఎగుమతి చేసేవారని చెబుతుంటారు.

### కబ్జాకు గురైన ఆలయ భూములు..

ఇందల్వాయి రామాలయానికి చెందిన సుమారు 40 ఎకరాల వ్యవసాయ భూములు కబ్జాకు గురయ్యాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డిచ్‌పల్లి మండలంలోని కూకట్‌పల్లి, సుద్దులం గ్రామాల్లోని ఆలయ భూములను కొందరు కబ్జా చేశారని ఆధారాలతో ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

### పాలకులు, అధికారుల నిర్లక్ష్యం..

ఘన చరిత్ర కలిగిన రామాలయాన్ని పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. దేవాదాయ శాఖ అధికారులతో సర్వే చేయించి రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గతేడాది మరోసారి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ కవిత తన నిధుల నుంచి ప్రహరీకి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మరికొన్ని నిధులు మంజూరు చేసి ఆలయ అభివృద్ధికి తోడ్పడతానని హామీ ఇచ్చారు. ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సైతం నిధులు మంజూరు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించినా.. నిధులు మాత్రం రావడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఘన చరిత్ర గల ఇందల్వాయి రామాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఆలయ అభివృద్ధికి నిధులివ్వాలి



ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఎంతో చరిత్ర కలిగిన ఇందల్వాయి రామాలయాన్ని ధూప దీప నైవేద్య పథకంలో చేర్చాలి. ఆలయాన్ని అభివృద్ధి చేస్తే జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

**– గోపాలచారి, ఆలయ పూజారి**





## ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానికంగా చావిడి గల్లీలోని మున్నూరుకాపు సంఘంలో ఆదివారం పురోహితులు రాజు మహారాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925లో విజయదశమి రోజున హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘాన్ని ప్రారంభించారన్నారు. ప్రజలకు సేవచేస్తూ, పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో విభాగ్ పర్యావరణ ప్రముఖ్ రామ్ నరేష్, గ్రామ పెద్దలు పత్తి లక్ష్మణ్, కూచి సిద్దు, ఏముల నవీన్, సాయిబాబా గౌడ్, శీను, రమేష్, శ్యామ్, సాయి ప్రసాద్, రాజు, సతీష్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

### గొట్టుముక్కల గ్రామంలో..

**అక్షరటుడే, మాక్లూర్:** ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను మాక్లూర్ మండలంలోని గొట్టుముక్కలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రాష్ట్రీయ స్వయం సేవక్ ఏర్పాటై వందేళ్లు పూర్తయిందని.. జిల్లాలో 75ఏళ్లు పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. ఆపద వచ్చినప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ప్రముఖ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి పరామర్శ

**అక్షరటుడే, నిజామాబాద్ రూరల్:** నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం రూరల్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తల్లి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం భూపతిరెడ్డిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఎన్‌డీసీసీ బ్యాక్ అధ్యక్షుడు కుంట రమేష్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ముప్పా గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వరదలు ముంచెత్తిన నెల రోజుల తర్వాత పరామర్శలా..: షబ్బీర్‌అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా ప్రజలు వరదలతో అల్లాడితే నెలరోజుల తర్వాత తీరిగ్గా వచ్చి పరామర్శిస్తారా.. అంటూ మాజీ మంత్రి హరీశ్ రావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. హరీష్ రావు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వరద బాధితులను పరామర్శించడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకృతి విపత్తుపై రాజకీయం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో వర్షాలు, వడగళ్ల వానలతో ఎన్నోసార్లు పంట నష్టం జరిగినా ఏ ఒక్కసారి కూడా రైతులను ఆదుకోలేదన్నారు. ప్రస్తుతం హరీష్ రావు ఇక్కడి ప్రజలపై ప్రేమతో రాలేదని, స్థానిక ఎన్నికల్లో పరువు కాపాడుకోవడానికి వచ్చారని విమర్శించారు. కుటుంబ సమస్యల నుంచి తేరుకొని బాధితులను పరామర్శించడానికి నెల రోజులు పట్టిందని ఎద్దేవా చేశారు. నాడు ప్రజల నివాసాలు నీళ్లలో కొట్టుకుపోయి హాహాకారాలు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎటుపోయారని ప్రశ్నించారు. వర్షాల్లో ప్రమాదమని తెలిసి కూడా సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో ముంపు ప్రాంతాలు పరిశీలించడానికి వచ్చారని పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించక ప్రజలను పరామర్శించలేకపోయారన్నారు. తిరిగి రెండు రోజుల్లో వచ్చి నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ. 11వేలు, చనిపోయిన వారి కుటుంబాలకు రూ.4 లక్షలు అందించారని గుర్తు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో రివ్యూ నిర్వహించి అధికారులను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారని, అధికారుల నివేదికను కేంద్రానికి పంపించారన్నారు.

### కేంద్రం నుంచి సాయం అందలేదు..

రాష్ట్ర ప్రభుత్వం నుండి చేయాల్సిందంతా చేస్తున్నారని, కేంద్రం నుండి ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందలేదని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మర్చిపోయే రోజులు వచ్చాయన్నారు. వారి హయాంలో దోపిడీ తప్ప రైతులకు, ప్రజలకు ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజలకు అనేక పథకాలను చేరువ చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ ది మాటల ప్రభుత్వమని.. తమది చేతల ప్రభుత్వమన్నారు. బీఆర్ఎస్ నేతలు బయటకేమో కేంద్రాన్ని విమర్శిస్తారని.. లోపల నుంచి బీజేపీకి సాయం అందిస్తుంటారని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కూడా బీజేపీకి సహాయపడ్డారన్నారు. వారి ప్రతి బిల్లుకు పరోక్షంగా, ప్రత్యక్షంగా మద్దతు తెలిపారన్నారు. ప్రజలందరికీ ఈ విషయం తెలిసే బీఆర్ఎస్‌ను ఓడించారని వ్యాఖ్యానించారు.